దేశవ్యాప్త సమ్మె విజయవంతం

హయత్‌నగర్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విజయవాడ జాతీయ రహదారిపై నిర్వహించిన మానవహారం శుక్రవారం పెద్ద ఎత్తున జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ.. బీజేపీ ప్రధాని మోదదీ మతోన్మాద బీజేపీ విధానాలైనా, కార్మిక రైతు వ్యవసాయ రంగాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి దేశాన్ని పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని హిందూ మతోన్మాదం, మత తత్వంగా మార్చివేసి కాషాయం చేయాలని, దళిత, క్రిస్టియన్ మైనార్టీలపై దాడులు చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ బంధ్ సందర్భంగా హయత్‌నగర్‌లో కార్మికులతో కలిసి మానవహారం నిర్వహించి నిరసన తెలుపుతున్నామని తెలిపారు. అంతకుముందు హయత్‌నగర్ ఆర్టీసీ బస్ డిపోల ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బర్గు ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుండె శివకుమార్, రైతు సంఘం నాయకులు భిక్షపతి, మధ్యాహ్న భోజన కార్మికులు రమాదేవి, లక్ష్మమ్మ, నవనీత, స్వరూప, రంగమ్మ, నిర్మలమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో హైవేపై మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో ర్యాలీ..

ఎల్బీనగర్, ఫిబ్రవరి 16: గ్రామీణ బంధు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరవెంకుల నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. కూలీలకు ఆధారంగా ఉన్న పథకానికి నిధులు తగ్గించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు జలందర్, చైతన్య, మల్లేశ్, వెంకన్న, శ్రీనివాసులు, లతీఫ్, రవి, బాలస్వామి, బుచ్చమ్మ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను కేవీపీఎస్ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేవీపీఎస్ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన ఎల్బీనగర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ హాజరై మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు సామాన్య ప్రజలపై మోపుతున్న అధిక ధరలను నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిట్ర దుర్గారావు, నాగేశ్, జంగయ్య, భాగ్యమ్మ, సంతోష, కృష్ణమ్మ, జయమ్మ, యాదమ్మ, పద్మ, మంజుల, అంజయ్య, సుక్కమ్మ, యాదగిరి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీలు..

సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని క్రీడా కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా ఆటోనగర్‌కు తరలివచ్చారు. ఆటోనగర్‌లోని టీసీఐ కార్మికులు, ఐలా కాంట్రాక్ట్ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కేసరి నర్సిరెడ్డి, నాయకులు బ్రహ్మచారి, ఎన్.ఆంజనేయులు, సుదర్శన్ రెడ్డి, సోమయ్య, సీహెచ్.కృష్ణయ్య, బి.కనకయ్య, లింగం, సుధీర్, దయానంద్, రావుల రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నడ్డి విరుస్తున్న కేంద్రం

కందుకూరు, ఫిబ్రవరి 16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల నడ్డి విరుస్తుందని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ తెలిపారు. దేశ వ్యాప్తంగా కార్మిక కర్షక గ్రామీణ బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులు, కార్మికులు రాస్తా రోఖో నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అంకగాల్ల కుమార్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్, ఆర్ చందు, సాయిలు, శ్రీనివాస్, యాదయ్య, శేఖర్, సత్తయ్య, కుమార్, శ్రీనివాస్, కిషన్, బాల్‌రాజ్‌గౌడ్, గ్రామ పంచాయతీ వర్కర్లు, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొత్తపేటలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ఇతర కార్మిక విభాగం నాయకులు

ఆటోనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కేసరి నర్సిరెడ్డి తదితరులు

కందుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

బైరమాల్‌గూడ ఫ్లై ఓవర్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికే ఫ్లై ఓవర్లు

చంపాపేట, ఫిబ్రవరి 16: ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకే నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లై ఓవర్లు నిర్మాణం చేపట్టడం జరిగిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని బైరమాల్‌గూడ అలేఖ్య టవర్ ముందు నుంచి నిర్మిస్తున్న స్కైవే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను శుక్రవారం పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కైవే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ముగింపు దశకు చేరాయని.. త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారులు దేవానంద రవీందర్‌రాజు, పరమేశ్, రోహిణి, కార్తీక్, నాయకులు అనంతుల రాజిరెడ్డి, చిరంజీవి, మధుసాగర్, కిరణ్, బంటి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ ఏసీపీకి సన్మానం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16: ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అమరగాని కృష్ణయ్యను శుక్రవారం రాష్ట్ర గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొండ జానయ్య గౌడ్ ఆధ్వర్యంలో పలువురు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఏసీపీ కృష్ణయ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, చెన్నగోని వెంకన్నగౌడ్, జాలే వెంకట్‌రెడ్డి, దుబ్బాక గోపాల్‌రెడ్డి, ఎర్ర శేఖర్‌గౌడ్, కడారి బాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికాలనీలో సేవాలాల్ జయంతి

సైదాబాద్, ఫిబ్రవరి 16 : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి పురస్కరించుకొని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్, సేవాలాల్ బంజారా సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు సక్రిబాయి ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు సింగరేణికాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ రాందాసు తేజ, డాక్టర్ రాజన్న, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, అగ్రికల్చర్ ఆఫీసర్ యాదగిరినాయక్, న్యాయవాది ఆంజనేయులు చారి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఎస్సై ముజీరాం నాయక్, సేవాలాల్ బంజారా సంఘం నాయకులు నందులాల్ నాయక్, గోపాల్ నాయక్, గణేశ్ నాయక్, జూక్కిబాయి, శాంతిబాయి, తార్య నాయక్, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ రాందాసు తేజ, డాక్టర్ రాజన్న, కొర్రమోతిలాల్ నాయక్, సక్రిబాయి

లక్ష్య సాధనకు పట్టుదల తోడైతే విజయాన్ని ఎవరూ ఆపలేరు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 16: లక్ష్యసాధనకు పట్టుదల తోడైతే విజయాన్ని ఎవరూ ఆపలేరని వీరభోగ వసంతరాయలు సేవా ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ వీరభోగ వసంతరాయలు అన్నారు. శుక్రవారం కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ మోటివేటర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. మోటివేటర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మన ప్రయత్నాన్ని కొనసాగించే ధైర్యమే జీవితమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ విజేందర్‌రెడ్డి తదదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో మోటివేషన్ తరగతులకు హాజరైన వేణుగోపాల్‌రెడ్డి, వీరభోగ వసంతరాయలు, ప్రధానోపాధ్యాయుడు విజేందర్‌రెడ్డి తదితరులు

మీర్‌పేట సాయి బాబా దేవాలయంలో ఆదిత్య హృదయ గ్రంథం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళి సై. చిత్రంలో శ్రీసాయి కృప యోగి గోపాల కృష్ణ స్వామిజీ

దేవుని కృప అందరిపై ఉండాలి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 16: సాయిబాబా ఆశీర్వాదం అందరిపై ఉండాలని గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంత్ హిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠం, పరమ పూజ అవదూత శ్రీసాయి కృప యోగి గోపాల కృష్ణ నంద స్వామిజీ రచించిన ఆదిత్య హృదయ గ్రంథం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి: కిషన్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 16 : ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి తెలిపారు. పులిమామిడి గ్రామంలోని చీకటి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి జరుగుతున్నాయని, బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా శుక్రవారం కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డికి ఆలయ ధర్మకర్త మొకరాల రాజు శర్మ ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం దేవాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బ్రహ్మోత్సవాల పత్రికను అందజేస్తున్న రాజశేఖర్ శర్మ

గోశాల వార్షికోత్సవం.. శ్రీకృష్ణుడికి పూజలు

మాదన్నపేట, ఫిబ్రవరి 16: మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లోని గోశాల 3వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, నాయకులు కొత్త కాపు రవీందర్ రెడ్డి, దాసరి శ్యాం, తంగెళ్ల సుధీర్, ఉగాది మహేశ్, యోగి, వరుణ్, సాయి, కిరణ్, గోమాత సేవకులు తదితరులు పాల్గొన్నారు.

కారు డిక్కీలో రూ.9లక్షలు మాయం

సైదాబాద్, ఫిబ్రవరి 16: కారు డిక్కీలో పెట్టిన రూ.9లక్షల నగదు మాయమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మూసారాంబాగ్ సిరిపురం కాలనీలోని నివసించే రాజ్‌కుమార్ వ్యాపారి. గురువారం ఉదయం రూ.9లక్షలు తన కారు డిక్కీలో పెట్టుకొని తెలిసిన వారి పెండ్లికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత కూడా డబ్బులను అలాగే కారులోనే వదిలివేశాడు. మళ్లీ శుక్రవారం కూడా మరో పెండ్లికి వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం సాయంత్రం కారు డిక్కీలో పెట్టిన డబ్బుల బ్యాగ్ కనిపించకపోవటంతో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

నూతన నియామకం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 16: మన్సూరాబాద్ వాసవి క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. వీఎన్ గోల్డెన్, కేసీజీఎఫ్ అల్లాడి పరమేశ్వరరావు, వైస్ గవర్నర్ గుడ్డేటి నర్సింహులు, రీజియన్ చైర్మన్ శ్యాంసుందర్, సెక్రటరీ శివనాగేశ్వరరావు, జోన్ చైర్మన్ సాయిమోహన్ పర్యవేక్షణలో మన్సూరాబాద్ వాసవి క్లబ్ అధ్యక్షుడిగా మొరిశెట్టి సంతోష్‌కుమార్ గుప్తా, ప్రధానకార్యదర్శి సోమ శ్రీనివాసరావు, కోశాధికారిగా అంజి బాబు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి బద్రీనాథ్, విశ్వనాథ్, జనార్దన్, దామెర సత్యనారాయణ, బండారు అశోక్, రంగా శ్రీధర్, రంగా నరేందర్, అనిల్, వెంపటి గోపి, గార్లపాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, ఫిబ్రవరి 16 : నల్గొండ చౌరస్తా నుంచి ఒవైసీ దవాఖాన వరకు కొనసాగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ దోబీఘాట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు శ్రీకార్ హోటల్, బోబీ రెడ్డి కాలేజ్, గణేశ్ టెంపుల్, వినయ్ నగర్ కాలనీ, పూసలబస్తీ, ఐఎస్ సదన్, పెట్రోల్ పంప్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

25న ఎన్నికలు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 16: గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఫిబ్రవరి 25న నిర్వహించనున్నట్లు గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం చీఫ్ ఎన్నికల అధికారి చిదర రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 20న లలితానగర్‌లోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం కల్యాణ మండపంలో నామినేషన్లు స్వీకరిస్తామని.. ఫిబ్రవరి 21న విత్‌డ్రా ఉంటుందని, ఈనెల 25న కోదండరాంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఫోన్ నంబర్ 8555045634లో సంప్రదించాలని కోరారు.

నగల దుకాణం దొంగలు దొరికారు

- రూ. 24 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ ధరావత్ జానకి

సైదాబాద్, ఫిబ్రవరి 16 : బంగారు నగల షాపులో పట్టపగలే చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. దోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితులను 16 గంటల్లోనే గుర్తించి అరెస్ట్‌చేశారు. నిందితుల నుంచి రూ. 24 లక్షల విలువజేసే 330. 84 గ్రాముల బంగారు, వెండీ ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సైదాబాద్‌లోని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను డీసీపీ ధరావత్ జానకి వెల్లడించారు. ముంబైకి చెందిన నజీమ్ అజీజ్ కోటాడియా (36), ఉత్తర ప్రదేశ్‌కు చెందిన షౌకత్ రైనీ (19) రాపిడో రైడర్, వారిస్ (18) రాపిడో రైడర్లుగా పనిచేస్తున్నారు. జల్సాలకు ఆలవాటు పడి.. ఈజీగా డబ్బులు సంపాదించాలనే దురాశతో వీరంతా కలిసి అక్బర్‌బాగ్ చౌరస్తాలోని కిస్వా జ్యూవెలర్స్ షాపులో బుధవారం మధ్యాహ్నం దోపిడీకి పాల్పడ్డారు.

అసలేం జరిగింది..

నజీమ్ అజీజ్ కోటాడియా రాపిడో డ్రాప్ చేయడానికి కిస్వా జ్యూవెలరీ షాపు వద్దకు వచ్చాడు. అప్పుడు షాపులో ఒకే వ్యక్తి ఉండటాన్ని గమనించారు. ఎలాగైనా దోపిడీ చేయాలనే తన ఆలోచనలను షౌకత్ రైనీ, వారిస్‌కు చెప్పటంతో వారు ఆసక్తి చూపించారు. ముగ్గురు షాపు వద్దకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఈ దుకాణంలో చోరీకి ప్లాన్ చేసి.. రెక్కీ కూడా నిర్వహించి, అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ అవకాశం బుధవారం వచ్చింది. షాపులో యజమాని కుమారుడు షాజీ ఉర్ రెహ్మాన్ ఒక్కడే ఉండటాన్ని నేరగాళ్లు గమనించారు. పథకం ప్రకారం ముఖాలకు మాస్కులు ధరించారు. నిందితుల్లో ఒకరు దుకాణంలోకి వెళ్లి నగలు కొనుగోలు చేస్తున్నట్టు నటిస్తుండగా.. నజీమ్ అజీజ్ కోటాడియా తన వద్ద ఉన్న కత్తితో దుకాణంలో షాజీ ఉర్ రెహ్మాన్‌పై దాడిచేసి నగలతో ఉడాయించారు. గాయపడ్డ షాజీ ఉర్ రెహ్మాన్ దోపిడీ ఘటనపై తన తండ్రికి, పోలీసులకు సమాచారమిచ్చి, ఫిర్యాదు చేశారు. దోపిడీ తర్వాత నిందితులు తమ ద్విచక్ర వాహనాలపై అబిడ్స్‌లోని తాజ్ హోటల్‌కు చేరుకొని.. అక్కడే వాహనాలు పార్కింగ్ చేసి సికింద్రాబాద్ వైపు వెళ్లారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సాంకేతిక సహకారంతో క్లూస్ లభించాయి. దోపిడీకి పాల్పడ్డ ముగ్గురు నిందితుల కదలికలను సీసీ కెమెరాల పుటేజీ ద్వారా గుర్తించి, నిఘా పెట్టి అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ. 24 లక్షల విలువైన 330. 84 గ్రాముల బంగారం, 124.19 గ్రాముల వెండీ ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్, చాదర్‌ఘాట్ క్రైం పోలీసులను డీసీపీ అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు డీసీపీ పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ డీసీపీ అందె శ్రీనివాస్‌రావు, సౌత్-ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ జి. మనోహర్, మలక్‌పేట డివిజన్ ఏసీపీ శ్యామ్ సుందర్, సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ రెడ్డి, డీఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల నుంచి స్వాధీన పర్చుకున్న బంగారు, వెండి ఆభరణాలను చూపిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ ధరావత్ జానకి తదితరులు

బహిరంగ ప్రకటన

4వ అదనపు జిల్లా జడ్జ్ కోర్టు, మహబూబ్‌నగర్
ఓఎస్.నెం.19/2015

జిట్స్ : ... వాది
శ్రీ కొత్త చెన్నయ్య మరియు ఇతరులు
మరియు
శ్రీ కొత్త సత్యనారాయణ మరియు ఇతరులు ... ప్రతివాదులు

పై కేసును శ్రీ కొత్త చెన్నయ్య మరియు ఇతరులు సత్యనారాయణ మరియు ఇతరులు జడ్చర్ల గ్రామ శివారులోని సర్వే నెం.354, 355, 357 లో గల భూమిపై భాగపలిష్కారం గురించి సివిల్ దావా ఓ.ఎస్. నెం. 19/2015 కేసు వేయడం జరిగినది. ఇట్టి కేసులో ప్రతివాదులుగా చేర్చబడిన (1) శ్రీమతి రాచూరి శిరీష భర్త కొమ్మూరి ఉదయ ప్రకాష్ రెడ్డి, నివాసము ఇంటి నెం.3-45/201, హనుమాన్‌నగర్, చైతన్యపురి, హైద్రాబాద్ గారిని పై కేసులో 96 ప్రతివాదిగా మరియు (2) శ్రీమతి జి. సరిత భర్త సతీష్‌కుమార్, నివాసము: ఇంటి నెం.6-4, మంగాయిగూడి, కొత్తకోట గ్రామం & మండలము, వనపర్తి జిల్లా గార్లను పై కేసులో 96వ, 30వ ప్రతివాదులుగా చేర్చడం జరిగినది. పై వారికి కోర్టు ద్వారా సమన్స్ మరియు నోటీసులు అందకపోవడం వల్ల కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా పై కనబర్చిన ప్రతివాదులకు తెలియజేయడం ఏమనగా పై కేసు నందు తమరు ప్రత్యేకంగా గాని తాము నియమించుకున్న న్యాయవాది ద్వారా గాని ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా పైన తెలిపిన కోర్టు వారి ముందు తేది 19-02-2024 నాడు ఉదయం 10:30 గం॥లకు హాజరు కావాల్సిందిగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయనైనది. కావున బహిరంగ ప్రకటనను పురస్కరించుకొని తేది 19-02-2024 నాడు కోర్టు ముందు హాజరు కాగలరని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

తేది: 04-02-2024

టి. శ్రీనివాస్ గౌడ్, అడ్వకేట్,
ఇం.నెం.1-65/2, కోర్టు ఎదురుగా, జడ్చర్ల
మహబూబ్‌నగర్. సెల్:9848804679

సంతూర్ మహిళా స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక

స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులను అభినందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 16: 2024 సంతూర్ మహిళా స్కాలర్‌షిప్‌నకు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం మొదటి సంవత్సరం విద్యార్థినులు సీహెచ్. మానస, ఈ.మౌనిక ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటి 2024 సంతూర్ మహిళా స్కాలర్‌షిప్ రూ.24వేలు సాధించినందుకు విద్యార్థినులను, వారిని ప్రోత్సహించిన లైబ్రేరియన్ అమరేందర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ షరూఖీ, అధ్యాపకులు డాక్టర్ మల్లేశం, డాక్టర్ జాహేదా బేగం, డాక్టర్ సునీత, డాక్టర్ ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.